
# ఒక ప్రేమకథ

ఎస్. వెంకటేశ్వరరెడ్డి



"ఆరున్నరకల్లా గ్రీన్‌పార్క్ హోటల్‌కి వచ్చెయ్. కారు పంపించనా ఆఫీస్‌కి" అడిగాడు నవీన్.

"వద్దులేరా. నేనే ఆటోలో వచ్చేస్తా" అని చెప్పి ఫోన్ పెట్టేసి టైమ్ చూసుకున్నాను.

మూడు నలభై కావస్తోంది. వున్న కాస్త పని ముగించేసుకుని ఇంటికి బయల్దేరాను.


"అప్పుడే వెళ్ళిపోతున్నావా?" అడిగాడు పక్కసీట్లో కూర్చున్న కార్తీక్.

"ఫ్రెండ్ వాళ్ళ చెల్లెలి పెళ్ళికి వెళ్ళాలి" అని చెప్పి ఆఫీస్‌నుంచి బయటపడ్డాను.

ఆటో ఎక్కి అమీర్‌పేటకి అని చెప్పాను.

జ్యోతి వెడ్స్ వినయ్. చేతిలో వున్న శుభలేఖను తెరిచి చూశాను. నవీన్ వాళ్ళ బాబాయ్ కూతురు జ్యోతి. బెంగుళూరులో ఏదో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. పెళ్ళికొడుకు కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే చేస్తున్నాడుట.

అశ్విని కూడా పెళ్ళికొస్తుందని చెప్పాడు ఇందాక నవీన్ ఫోన్‌లో. ఆరు నెలల తరువాత మొదటిసారి అశ్వినిని కలుసుకునే అవకాశం వస్తుందని ఒకవైపు మనసులో




ఆనందంగా వున్నా మరోవైపు తెలియని భయం.

యూనివర్శిటీలో చదివే రోజుల్లో పరిచయం మా ఇద్దరిది. నేను ఎంసిఎ రెండో సంవత్సరంలో వుండగా ఎం ఎ సోషియాలజీలో చేరింది తను. నవీన్ క్లాస్‌మేట్ తను. నేను నవీన్ చిన్నప్పటినుండీ కలిసి చదువుకున్నాము. ఇంటర్ తర్వాత నేను సైన్స్‌గ్రూపు, వాడు ఆర్ట్స్ గ్రూపు తీసుకుని చదువుల దారుల్లో వేరుపడ్డా మా దోస్తీ మాత్రం ఎప్పటి లాగానే సాగిపోయింది.

డిగ్రీ పూర్తయ్యాక నేను ఎంసిఎలో చేరడం, నవీన్ ఒక సంవత్సరం ఏవో చిన్నా చితకా ఉద్యోగాలు చేసి చివరకు విసుగుచెంది నేను చదివే యూనివర్శిటీలోనే ఎం ఎ సోషియాలజీలో చేరడం జరిగిపోయాయి. అశ్విని, నవీన్ ఒకే క్లాసులో వుండటంతో అప్పుడప్పుడూ నవీన్‌ని కలవడానికి వెళ్ళినప్పుడు కనిపిస్తుండేది అశ్విని.

చూసిన ప్రతిసారీ అలాగే చూస్తూ వుండిపోవా లనిపించే అందం ఆమెది. ఒక్కోసారి పురివిప్పిన నెమలిలా, చెంగు చెంగున ఎగిరే లేడిపిల్లలా, గల గల పారే సెలయేరులా ఎప్పుడూ చిరునవ్వు నలంకరించుకుని అందరితో కలుపుగోలుగా మాట్లాడుతూ తిరిగే అశ్వినిని చూస్తూ చూస్తూ నేను ప్రేమలో పడిపోయాను.

ఎప్పుడైనా నవ్విందంటే చాలు, ఆ నవ్వుల సవ్వడి వీనుల విందైన సంగీతంలా నా మనసుకి సోకేది. మిగతా వాళ్ళకి తన చేష్టలు, నవ్వులు ఎలా అనిపించేవో ఎలా వినిపించేవో కానీ నాకయితే తెలియదు.

యూనివర్శిటీలో చేరిన ఆరు నెలల్లోనే నవీన్, అశ్వినిలు మంచి స్నేహితులు అయిపోయారు.

నవీన్ నాకు దూరమైపోతున్నందుకో, అశ్విని నాకు దగ్గర కానందుకో లేక నవీన్ అశ్వినిలు దగ్గరవుతున్నందుకో తెలియదుకానీ రోజు రోజుకి నా మనసు చెప్పలేని బాధతో నిండిపోయేది.

''మీ ఫ్రెండ్ నన్నెందుకలా తినేసేలా చూస్తుంటాడు'' అని నవీన్‌ని అడిగిందట అశ్విని. అదేదో పెద్ద జోక్‌లా నాతో చెప్తే నా కళ్ళలో నీళ్ళు తిరగడం నాకింకా గుర్తుంది.

నవీన్‌తో పని వున్నా లేకపోయినా తనని చూడాలనే నెపంతో రోజుకు రెండుసార్లయినా సోషియాలజీ క్లాస్‌రూమ్ వైపు వెళ్ళేవాడిని. నవీన్ గాడికి కొన్ని రోజులకి విషయం అర్థమైపోయింది. ఒకరోజు నన్ను క్యాంటిన్‌కి తీసుకెళ్ళి అడిగేశాడు.

''అశ్విని అంటే ఇష్టమా?'' అని సూటిగా అడిగేసరికి సమాధానం ఏం చెప్పాలో తెలియక బిక్కమొహం వేసిన నన్ను చూసి పడి పడి నవ్వాడు.

నాకు చాలా కోపమొచ్చింది. నవీన్‌ని చెడామడా తిట్టేశాను. నాకీ ప్రేమలు, అమ్మాయిలు కొత్తేమీ కాకపోయినా అంతకుముందు నేను ప్రేమించా ననుకున్న రోజుల్లో లేని ఏదో తెలియని కొత్తదనం ఆరోజుల్లో వుండేది. అంతకుముందు నాకెదురైన అనుభవాలు ప్రేమకాదని అశ్వినితో నేను అనుభ విస్తున్నదే నిజమైన ప్రేమని నవీన్‌కి చెప్పాను.

నేను ప్రేమలో పడ్డ ప్రతిసారీ ఇలాగే చెప్తానని, నేను జీవితాంతం ఎప్పుడూ ఎవరో ఒక అమ్మాయిని గాఢంగా లోతుగా ప్రేమిస్తూనే వుంటానని జోక్ చేశాడు. నేను మాత్రం ధృఢ నిశ్చయంతో చెప్పే శాను, నేను ప్రేమించేది, పెళ్ళంటూ చేసుకుంటే అది అశ్విని ఒక్కదాన్నే అని.

నా సీరియస్‌నెస్ చూసి వాడికి నవ్వాగలేదు. అసలు తప్పంతా నాదే అనిపించింది. నా సొంత విషయాలన్నీ నవీన్‌కి పూసగుచ్చినట్టు చెప్పడం, వాడు నన్ను ఎప్పట్లానే ఏడిపించడం, మరోసారి నా విషయాలేవీ నవీన్‌కి చెప్పకూడదనుకోవడం, వాడి దగ్గర ఏ విషయమూ దాచకపోవడం మా మధ్య సర్వసాధారణమయిపోయింది.

''ఏడిపించడం మాని వీలయితే సహాయం చెయ్యరా'' అని ప్రాధేయపడ్డాను.

గ్రీన్‌పార్క్ హోటల్లో పార్టీ ఇస్తానంటే సరే అన్నాడు. నవీన్ సహాయంతో అశ్విని మనసు ఎలాగైనా గెలుచుకోవచ్చనే సంతోషంతో మనసు కొంచెం కుదుటపడింది.

అప్పటికే లంచ్ టైమ్ కావస్తుండటంతో అందరూ క్యాంటిన్ వైపు రావడం మొదలుపెట్టారు. అశ్విని కూడా వచ్చి మాతోపాటే కూర్చుంటే బావుండునని మనసులో అనుకున్నానో లేదో ''హాయ్, నవీన్'' అంటూ నా ఎదురుగుండా కుర్చీలో కూర్చుంది తను.

నవీన్ ఫ్రెండ్ అయినా నేనెప్పుడూ పలక రించను కూడా లేదు. పార్టీకి కక్కుర్తి పడి అయినా అశ్వినికి నన్ను పరిచయం చేస్తాడేమోనని నేను ఆతృతగా ఎదురు చూస్తుంటే తినడానికేమైనా తెస్తానంటూ లోపలికెళ్ళిపోయాడు మా ప్రాణ మిత్రుడు, మమ్మల్నిద్దర్నీ ఒంటరిగా వదిలి.

అమ్మాయిల్తో మాట్లాడడం నాకు కొత్త కాకపోయినా అశ్విని ముందు నేను ముడుచుకు పోయి కూర్చున్నానారోజు. అసహనంగా నేను అటూ ఇటూ ఇబ్బందిగా కదుల్తుంటే అడిగింది అశ్విని.. ''మీకు పెళ్ళయిందా?'' అని.

ఇరవై రెండేళ్ళకే పెళ్ళయిపోయిన అంకుల్‌లా కనిపిస్తున్నానా? అని నామీద నాకే అనుమానం వచ్చింది. తమని ఇష్టపడే అబ్బాయిలంటే అమ్మా యిలకంత చులకన భావమెందుకో అర్థం కాలేదు. అయినా కూడా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలనే సంస్కారంతో ''నాకు పెళ్ళి కాలేదు'' అని చెప్పి అక్కడ్నుంచి లేవబోతుంటే నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ మరో ప్రశ్న విసిరింది.

''అసలు జీవితంలో పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన వుందా?'' అని.

ఖచ్చితంగా వుంది, కానీ నీలాంటి కఠిన హృదయం కలిగిన దానిని మాత్రం కాదని చెప్పాల నిపించింది. ధైర్యం చాలక పెళ్ళిచేసుకోవాలనే ఆలోచన వుందన్నట్టుగా తలూపాను.

''మరి నన్ను పెళ్ళి చేసుకుంటావా?'' అని ఆటంబాంబు పేల్చినట్టు మూడోప్రశ్న వేసి సమా ధానం కోసం ఎదురుచూడకుండా పరుగులాంటి నడకతో అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

ఇంతలో చేతిలో రెండు ప్లేట్లతో ప్రత్యక్ష మయ్యాడు నవీన్.

''ఏంట్రా! కొంపతీసి ఐలవ్ యూ అని చెప్పే సావా?'' అడిగాడు నవీన్.

''సార్ లెఫ్టా రైటా?'' అని ఆటోవాడు సడన్ బ్రేక్ వేసి అడగడంతో ఈలోకంలోకి వచ్చిపడ్డాను.

రెండు నిముషాల్లో ఇల్లొచ్చేసింది. ఎంత వద్దను కున్నా అశ్విని ఆలోచనలే మనసంతా అలుముకొని పోయాయి.

షవర్ కింద స్నానం చేస్తుంటే నేను, అశ్విని వర్షంలో నడుస్తూ గంటలు గంటలు గడిపిన రోజులు గుర్తొచ్చాయి.

స్నానం ముగించి బట్టలేసుకుంటూ నవీన్‌కి ఫోన్ చేశాను. నాక్కొంచెం పనుందని రావడం కుదరదేమోనని. అలా అయితే జీవితంలో నా మొహం చూడనని టక్కున పెట్టేశాడు. నాకు తెలుసు నేనక్కడికి వెళితే పాత స్నేహితుల మధ్యలో నేను అశ్విని మాట్లాడుకోకుండా ఇబ్బందిగా వుండాల్సిరావడం ఊహించుకుంటే అసలు పెళ్ళికి వెళ్ళకపోతేనే మంచిదనిపించింది.

టైమ్ ఇంకా ఐదే అయింది. ఇంకా గంటన్నర టైమ్ వుంది. సోఫాలో కూలబడి టివిపెట్టి ఇట్నుంచి అటూ, అట్నుంచి ఇటూ ఛానెల్స్ అన్నీ ఒకసారి

చూసి టివి కట్టేశాను. వెళ్ళాలా? వద్దా? అనే ఆలోచనల్తో మనసంతా గందరగోళంగా తయారయింది. ఆరునెలల్లో ఇదే మొదటిసారి అశ్వినిని కలుసుకోవడం.

మొదటిసారి మేమిద్దరం మనసు విప్పి మాట్లాడుకొన్న రోజు గుర్తొచ్చింది. ఒక అమ్మాయి నా దగ్గరకొచ్చి పెళ్ళిచేసుకుంటావా అని అడిగితే అది నిజమా అబద్ధమా అని తేల్చుకోవడానికి రెండు రోజులు పట్టింది. రెండు రోజులు క్లాసులెగ్గొట్టి తీవ్రంగా ఆలోచించి ఇంటిదగ్గర్లో వున్న కనకదుర్గ గుడి వద్దకెళ్ళి ఒక పసుపుతాడు ఒక పసుపుకొమ్ము కొని జేబులో పెట్టుకుని తర్వాత రోజు ఉదయాన్నే యూనివర్శిటీకి బయల్దేరాను.

ఆరోజు నాకంత ధైర్యమెలా వచ్చిందో నాకిప్పటికీ అర్థంకాదు.

సోషియాలజీ క్లాసుకెళ్ళి అశ్వినిని బయటకు పిలిచాను. బయటకు రాగానే పెళ్ళిచేసుకుందామా అని జేబులోంచి పసుపుతాడు తియ్యడంతో కంగారుపడిపోయింది. అశ్విని వెనకే క్లాసులోంచి బయటకొచ్చిన నవీన్ నా ధైర్య సాహసాల్ని చూసి శిలా ప్రతిమలా నిల్చుండిపోయాడు.

స్వతహాగా ధైర్యవంతుడినయిన నేను అంతకుముందు రెండు మూడుసార్లు ధైర్యంగా నా ప్రేమ వ్యక్తపరచడం వల్లనే అమ్మాయిలు నా ప్రేమనంగీకరించారు. అప్పుడు కూడా అలాగే జరుగుతుందనే నమ్మకంతో ధైర్యే సాహస లక్ష్మి అనుకుని ఆ సాహస కార్యానికి తలపడ్డాను.

ముందు షాక్ తిన్నా తర్వాత నాకు షాక్ తినిపించింది అశ్విని. హేండ్‌బ్యాగ్ లోంచి ఒక గ్రీటింగ్ కార్డ్ తీసి నాకిచ్చింది. నల్ల బ్యాక్‌గ్రౌండ్ పై ఎర్ర అక్షరాలతో ' ఐ లవ్ యూ' అని ముద్రించి వుంది.

అలా మా ఇద్దరి మధ్యా మొదటి పరిచయమే వింత వింతగా జరిగిపోయింది. ఆరోజు మొదలు యూనివర్శిటీలో కనీసం నాలుగ్గంటలు ఇంటికొచ్చాక మరో రెండు మూడు గంటలు ఫోన్లో మాట్లాడుకోందే రోజు గడిచేది కాదు.

పెళ్ళంటూ చేసుకుంటే ప్రేమించినమ్మాయినే చేసుకుంటానని ఎప్పుడూ ఫ్రెండ్స్‌కి ఛాలెంజ్ చేసి చెప్పేవాడిని. నేనెంతో ఇష్టపడిన అశ్విని నా జీవితంలోకి రావడంతో నా మాట కాస్త నిజమయ్యే రోజు దగ్గర పడిందనే ఆనందంతో నా మనసు పరవళ్ళు తొక్కేది.

ప్రేమ పెళ్ళిళ్ళకు ఎన్ని అడ్డంకులుండాలో అన్నీ మా ప్రేమకూ వుండేవి. మా కులాలు వేరు. స్థితిగతులు వేరు. ఇవన్నీ వేరైనా ప్రేమ పెళ్ళిళ్ళను వ్యతిరేకించడంలో మా ఇద్దరి కుటుంబాల అభిప్రాయాలు మాత్రం ఒక్కటే. వీటన్నింటినీ అధిగమించి మేమిద్దరం ఒకటి కావాలనుకుని కలలు కనేవాళ్ళం.

ఒకటిన్నర సంవత్సరం పాటు మా ప్రేమకు హద్దులు లేకుండా పోయాయి.

మధ్య మధ్యలో చిన్న చిన్న అభిప్రాయ భేదాలు, తిట్టుకోవడాలు, అలగడాలు, బుజ్జగించుకోవడాలు వున్నా కూడా అవన్నీ ప్రేమలో భాగంగానే భావించే వాళ్ళం.

ఎలా తెలిసిపోయిందో కానీ ఇద్దరి ఇళ్ళల్లోనూ మా ప్రేమ విషయం తెలిసిపోయింది. తమ కొడుకు తమ కులంకాని అమ్మాయిని ప్రేమిస్తున్నాడని, ఒక మధ్య తరగతి కుటుంబంలో ఎంత గొడవ జరగాలో అంత గొడవ మా ఇంట్లోనూ జరిగింది.

నేను మాత్రం ఎప్పటిలానే మా అమ్మానాన్నల తిట్లు విన్నానే కానీ వాళ్ళకి ఎదురు చెప్పి మాత్రం మాట్లాడలేదు. నాకు తెలిసినంతవరకూ వాళ్ళకు తప్పుగా అనిపించే విషయాలు నాకు తప్పని అనిపించకపోవచ్చు. వాళ్ళకు మంచి అనిపించే విషయాలన్నీ నాకు మంచి అనిపించకపోవచ్చని కూడా తెలుసు. అందుకు కారణాలు ఎన్నో. వయసులో తేడా, చదివిన చదువుల్లో తేడా, పెరిగిన సమాజంలో తేడా, అన్నింటికీ మించి తరతరాలకీ మధ్య వున్న ఆలోచనా దృక్పథంలో తేడా. ఇన్ని తేడాలతో తల్లిదండ్రులు, పిల్లలు ఒక విషయాన్ని అభిప్రాయభేదాలు లేకుండా అంగీకరించగలరని నేనెప్పుడూ అనుకోలేదు.

అందుకే వాళ్ళెంత అరచి గీపెట్టినా నేను నమ్ముకునే సిద్ధాంతాలను నేను వదులుకోలేదు. అది వారి మీద ప్రేమ, గౌరవం లేక మాత్రం కాదు. వారు నమ్మిన సిద్ధాంతాల ప్రకారం ప్రేమ పెళ్ళిళ్ళు తప్పు. నాకు తెలిసినంతవరకూ ప్రేమించిన అమ్మాయిని పెళ్ళిచేసుకోవడమే కరెక్ట్.

తరానికీ తరానికీ మధ్య వుండే జనరేషన్ గ్యాప్‌ని పూడ్చడం ఎవ్వరివల్లా కాదని కూడా తెలుసు.

అశ్విని వాళ్ళ ఇంట్లో ఇంతకంటే పెద్ద గొడవే జరిగింది. అశ్విని మాత్రం చెరగని నవ్వుతో ఆ గొడవ సంగతేమీ జరగనట్టే కనిపించేది. తన వాళ్ళని ఎలా అయినా ఒప్పించి తీరాలన్న సంకల్పంతో ఎన్నో విధాలా ప్రయత్నించేది. అలా రోజూ గొడవలతో గందరగోళంగా మారిపోయిన మా ఇద్దరి ఇళ్ళల్లోనూ మా బాధాకర హృదయాలు చూసి కరిగిపోయారో లేక మా ప్రేమకు అడ్డు చెప్పి మమ్మల్ని బాధించకూడదనుకున్నారో తెలియదు కానీ మొత్తానికి మా ప్రేమకు ఓకే చెప్పేశారు. పెళ్ళి పెళ్ళంటూ మా వెంటపడ్డారు.

నా ఎంసిఎ కూడా పూర్తయ్యి మంచి కంపెనీలో ఉద్యోగం కూడా సంపాదించడంతో మా పెళ్ళికి వున్న అడ్డంకులన్నీ తొలగిపోయినట్టయింది. అశ్విని ఎం ఎ కూడా పూర్తవడంతో ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టింది.

యూనివర్శిటీ నుండి బయటపడ్డప్పటినుంచీ ఇద్దరి మధ్యా దూరం ఎక్కువయింది. రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటూనే వున్నా, ప్రతి ఆదివారం వాళ్ళింట్లోనో, మా ఇంట్లోనో కలుస్తూనే వున్నా ఏదో తెలియని దూరం మమ్మల్నిద్దర్నీ వేర్వేరుగా ఉంచసాగింది.

అంతకుముందు ఎన్ని చిన్న గొడవల్ని విజయవంతంగా సర్దుబాటు చేసుకున్న మేము రాను రాను చీటికీ మాటికీ గొడవలు పెట్టుకుని ఒకరితో ఒకరం కొన్ని రోజులు మాట్లాడకుండా గడిపేవాళ్ళం.

ఆఫీస్ పనిమీద నన్ను ఆరునెలల కోసం బెంగుళూరు పంపించడంతో అంతవరకూ మనసుల్లోనే దూరంగా వున్నవాళ్ళం కాస్త మనుషులుగా కూడా దూరమయ్యాం. దానికితోడు అశ్విని అభ్యుదయ భావాలు కలిగిన మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరి స్త్రీ స్వాతంత్ర్యం గురించి, స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలని ఎదురించే పోరాటంలో సభలూ, ప్రసంగాలంటూ నాకోసం సమయం కేటాయించేది కాదు. ఎప్పుడైనా బెంగుళూరు నుంచి ఫోన్ చేసినా కూడా తన మహిళా సంఘం గురించి, తాము చేస్తున్న కార్యక్రమాల గురించో చెప్పి బోర్ కొట్టించేది.

మా ఇద్దరి కుటుంబాలలో మా మధ్య పెరుగుతున్న దూరాన్ని గమనించారో ఏమో, పెళ్ళి పెళ్ళి అంటూ తొందర పెట్టడం మొదలుపెట్టారు.

నాక్కూడా పెళ్ళయిపోతే అన్ని విషయాలూ సర్దుకుంటాయనిపించింది. అందుకే ఒక రాత్రి బెంగుళూరు నుంచి అశ్విని వాళ్ళింటికి ఫోన్ చేశాను. వాళ్ళ వాళ్ళ బావతో సినిమాకెళ్ళిందని చెప్పారు నాక్కాబోయే అత్తగారు. ఎంత చదువుకున్నా, ఎన్ని అభ్యుదయ భావాలున్నా, నాక్కాబోయే భార్య వేరొక మగవాడితో సినిమాకెళ్ళిందని తెలిసి మనసులోనే కొంచెం బాధపడ్డాను. అయినా నా బాధను బయటకు కనిపించకుండానే ఆ తర్వాతి రోజు ఫోన్ చేసి మామూలుగానే మాట్లాడాను.

తనకు కొత్తగా పరిచయమైన మరో ఫ్రెండ్ గురించి చెప్పింది.

మగవాడైనా స్త్రీ హక్కుల గురించి, స్త్రీ స్వాతంత్ర్యం గురించి అతనికున్న ఉన్నతమైన అభిప్రాయాల గురించి అరగంటసేపు నాకు చెప్పడంతో నాకుచాలా కోపమొచ్చింది.

త్వరగా పెళ్ళిచేసుకోవడమే ఈ సమస్యలన్నింటికీ పరిష్కారమని నవీన్ చెప్పడంతో ఆ



## నొప్పి

ఒకావిడ డాక్టర్ దగ్గరకొచ్చి "డాక్టర్‌గారూ, నా వేలితో ఎక్కడ టచ్ చేసినా నొప్పిగానే వుంటోంది" అని చెప్పింది.

"ముందు మీ విరిగిన వేలికి చికిత్స చేయించుకోండి" నింపాదిగా చెప్పాడు డాక్టర్.

వచ్చే శుక్రవారమే బెంగుళూరునుంచి హైదరాబాదు వచ్చేశాను. ఆదివారం నెక్లెస్‌రోడ్డులో కూర్చోబెట్టి నాక్కాబోయే భార్య ఎలా వుండాలో ఏ విధంగా నడుచుకోవాలో అశ్వినికి విడమరచి చెప్పాను.

అంతా విని నాక్కావలసింది ఇంట్లో కూర్చుని వంటపని, ఇంటిపని చేసే పనిమనిషి అని, అందుకు తను సిద్ధంగా లేనని, స్త్రీలకు కూడా ఒక జీవితముంటుందనీ, జీవితంలో ఏదో సాధించాలనే కలలుంటాయని వాటి సాధన కోసం స్త్రీకి స్వాతంత్ర్యం కావాలని, ఆ స్వాతంత్ర్యం దొరకని చోటు తనకవసరం లేదని చెప్పి కోపంతో వెళ్ళిపోయింది.

ఆరోజు నుండీ ఈరోజు వరకూ ఒకరి మొహం ఒకరు చూసుకోలేదు. సరికదా కనీసం ఫోన్లో అయినా మాట్లాడుకోలేదు. మా ఇంట్లో వాళ్ళు, వాళ్ళ ఇంట్లో వాళ్ళు ఎంత సర్ది చెప్పినా ఎవ్వరం వినలేదు. మా ప్రేమకథ ఎంత అర్ధాంతరంగా మొదలయిందో అంతే అర్ధాంతరంగా ముగిసిపోయింది.

ఆరోజు తర్వాత మళ్ళీ ఈరోజు అశ్విని కలుసుకోవలసి వస్తుండడంతో మనసంతా అల్లకల్లోలమైపోయింది.

ట్రింగ్..ట్రింగ్..మని ఫోన్ మోగడంతో కంగారుగా టైమ్ చూసుకున్నాను. ఆరున్నరైంది. అవతలివైపు నవీన్ తిడుతున్నాడు నేనింకా బయల్దేరనందుకు. ఇప్పుడే బయల్దేరుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటపడ్డాను.

గ్రీన్‌పార్క్ హోటలు దగ్గరే అవడంతో అశ్విని ఆలోచనల్తో భారమైన మనసుని మోసుకుంటూ కదిలాను.

ఈమధ్య పెళ్ళిళ్ళు హోటళ్ళలో ఏర్పాటు చేయడం ఫ్యాషన్ అయినట్టుంది. మా పెళ్ళికూడా ఏదో ఒక మంచి హోటల్లోనే ఏర్పాటు చేయాలని ఆరోజుల్లో అశ్విని వాళ్ళ నాన్నగారంటే నాకవన్నీ ఇష్టముండదనీ, ఏదో ఒక గుళ్ళో చేసేసుకుంటామనీ చెప్తే, అదేం కుదరదని ఒక్కగానొక్క కూతురి పెళ్ళి గొప్పగా చెయ్యాలని చెప్పడం గుర్తొచ్చింది.

నాకోసమే ఎదురు చూస్తున్నారు మా మిత్ర బృందమంతా. పెళ్ళిరాత్రి ఎప్పుడో అంట. కాకపోతే ముందు భోజనాలూ అవీ వున్నాయట. అశ్విని ఇంకా వచ్చినట్టు లేదు. ఆశగా వెతుకుతున్న నాకు ''మీ ఫ్రెండ్ ఇంకా రాలేదురా, వెతుక్కోకు'' అంటూ చెవిలో చెప్పాడు నా ప్రాణమిత్రుడు నవీన్.

వాళ్ళందరి ముందు నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. టైమ్ ఇంకా ఏడే అవడంతో అప్పుడే భోజనాలు చేసే ఆలోచనేమీ లేదని అందరూ చెప్పేశారు. మరేం చెయ్యాలని అందరూ ఆలోచనల్లో పడి ఒక్కొక్కరొక సలహా పడేశారు.

బంధువుల హడావుడిలో నవీన్ అందరినీ పలకరిస్తూ మొహం మీద ఒక నవ్వు పులుముకుని అటూ ఇటూ తిరుగుతున్నాడు. మూలగా దిగులుగా కూర్చున్న ఒక వ్యక్తి వద్దకెళ్ళి ఏదో చెప్తూ నావైపు చూశాడు. ఆ చూపుకర్థమేమిటో నాకర్థం కాలేదు. కొంచెంసేపు ఆ కొత్త వ్యక్తితో కూర్చుని ఏదో మాట్లాడి అతన్ని మా వైపే తీసుకొచ్చాడు.

ఈమధ్య కాలంలో రోజూ అద్దంలో దిగులుతో నిండిపోయిన నా మొహం చూసుకుని చూసుకుని నాకంటే దిగులుతో వున్న ఆ కొత్త వ్యక్తి మొహాన్ని చూసి జాలివేసింది. అతని పేరు ఆనంద్ అట. ఒకప్పుడు ఆనందంగానే వుండేవాడట. అతని విషాదానికి కారణం చెప్పాడు నవీన్.

ఆనంద్, మరి కొద్దిగంటల్లో వేరొకరి భార్య కాబోయే జ్యోతి మూడేళ్ళుగా ప్రేమించుకున్నారుట. ఇద్దరి కులాలు వేరవడం, ఇంట్లోవాళ్ళు ఒప్పుకోకపోవడం, ఆనంద్‌కి ఆత్మహత్య చేసుకోవాలనిపించడం, రొటీన్ తెలుగు సినిమా ప్రేమకథలానే వుంది ఆనంద్ ప్రేమకథ కూడా.

నవీన్ ఇదంతా నాకెందుకు చెప్పాడో అర్థం కాలేదు. సినిమాల్లో లాగా చివరి నిముషంలో ''ఈపెళ్ళి జరగడానికి వీల్లేదు'' అని మేమందరం కలిసి పెళ్ళి ఆపుచేసి జ్యోతి, ఆనంద్‌ల ప్రేమను పెళ్ళి వరకూ తీసుకెళ్తే బాగుంటుంది కానీ, నిజ జీవితంలో అది ఎంతవరకూ సాధ్యం అనిపించింది.

నేను కూడా ప్రేమలో విఫలమై వున్న కారణంగా, నాలాగే ధైర్యంగా జీవితంలో ముందుకు సాగిపోవడానికి ఏదైనా సలహా ఇస్తానేమోగాని ఆనంద్‌ని నాకు పరిచయం చేసి తన ప్రేమ గాథని నాకు వినిపించాడని నవీన్ చెప్పడంతో నాకు నవ్వొచ్చింది.

అశ్విని దూరమయ్యి నే పడుతున్న వేదన వీళ్ళకేం తెలుస్తుందనిపించింది. నేను డిగ్రీలో వుండగా తను ప్రేమించిన అమ్మాయికి వేరొకరితో పెళ్ళయిపోగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రవి, చిన్నప్పుడు మా ఊళ్ళో ఆత్మహత్య చేసుకున్న ప్రేమజంట, ఇప్పుడిక్కడ ప్రేమలో ఓడిపోయిన మరో ప్రియుడు... వీళ్ళందరినీ తలుచుకుంటే మన జీవితంలో ప్రేమ, ప్రేమ తర్వాత పెళ్ళి ఎంత ముఖ్యమైన ఘట్టాలో అర్థమయింది.

ప్రేమ వివాహం.

ప్రేమ, వివాహం. రెండు వేర్వేరు విషయాలైనా కూడా అవి రెండూ కలిసి ప్రేమవివాహమైతే అంతకంటే ఆనందించదగ్గ విషయం మరొకటుండదేమోనని ఆలోచనల్లో మునిగిపోయి వుండగా అశ్విని వచ్చింది.

ఆరు నెలల్లో ఇదే మొదటిసారి తనని చూడడం. ఒకవైపు సంతోషం మరోవైపు భయం. భవిష్యత్‌లో అశ్వినికూడా వేరొకరిని పెళ్ళి చేసుకుంటుంటే నేను కూడా ఆనంద్‌లా పెళ్ళిపందిరిలో మూల కూర్చుని '' ఎక్కడ వున్నా నీసుఖమే కోరుకున్నా'' అని ఆశీర్వదించి వెళ్ళిపోవాల్సిందేనా అనిపించింది.

ఏదో ఒకటి చేసి అశ్విని తిరిగి నా దగ్గరకు చేర్చుకోవాలనిపించింది. నాకు తనంటే ఇష్టం. నేనంటే తనకిష్టం. ఇద్దరి ఇళ్ళల్లోనూ కష్టపడి మా పెళ్ళికి ఒప్పించిన తర్వాత అర్థం లేని అభిప్రాయ భేదాలతో విడిపోయిన మా ఇద్దరినీ తలుచుకుంటే నవ్వొచ్చింది. అన్ని ప్రేమకథల్లోలాగే మా ప్రేమకథలోనూ విలన్స్ వున్నారు. విచిత్రంగా ఆ విలన్స్ మేమే అయ్యాము. మా ప్రేమకు మేమే అడ్డంకులై కూర్చున్నాం.


మారుతున్న సమాజంలో స్త్రీ స్వాతంత్ర్యం, హక్కులు, సమానత్వం గురించి అశ్విని మాట్లాడిన మాటల్లో తప్పేమీలేదని అనిపించింది. ఆ విషయం నాకిప్పటివరకూ ఎందుకు తోచలేదో అర్థం కాలేదు. మంచి ఉద్యోగం చేస్తూ, సూటూ బూటూ వేసుకుని ఆధునికత ముసుగులో నేనింకా పాతతరం మనిషినే అనిపించింది.

నాకింకేమీ ఆలోచించాలనిపించలేదు. దూరంగా నిల్చుని ఫ్రెండ్స్‌తో మాట్లాడుతున్న అశ్విని దగ్గరికెళ్ళి ''పెళ్ళెప్పుడు చేసుకుందాం?'' అని సూటిగా అడిగేశాను. చుట్టూ వున్న స్నేహితులంతా ఖంగుతిని అశ్విని వైపూ నావైపూ చూశారు.

ఆమె మొహంలో ఎప్పటిలానే ప్రశాంతత. హ్యాండ్‌బేగ్‌లోంచి ఏదో చిన్న డబ్బాలాంటిది తీసింది. అందులోంచి తాళిబొట్టు తీసి '' ఆరు నెలల నుంచి మోసుకుని తిరుగుతున్నాను. నా మెడలో వుండాల్సిన దీన్ని ఎన్ని రోజులు హ్యాండ్‌బేగ్‌లో పెట్టుకుని తిరగను?'' అని నన్ను ఎదురు ప్రశ్నించింది.

సరిగ్గా రెండునెలల తర్వాత అదే హోటల్లో పెళ్ళిపీటల మీద కూర్చున్నప్పుడు అశ్విని అంది ''తన స్వాతంత్ర్యం వేరొకరి బాధకు కారణమయినప్పుడు ఆ స్వాతంత్ర్యం తనకవసరం లేదని, ఇక ఎల్లప్పటికీ నాకు జీవిత ఖైదీగానే వుండిపోతుందనీ''

మరొకరి మనసు నొప్పించే స్వాతంత్ర్యం కంటే ఒకరికోసం ఒకరు జీవితాంతం బందీగా వుండడంలోనే సుఖముందనీ మేమిద్దరం అంగీకరించడంతో మా ప్రేమ వివాహమైంది. పెళ్ళి తర్వాత కూడా మా మధ్య గొడవలు రావని గ్యారంటీ ఏమీ లేదు. అప్పుడు ఇంకో కథ చెబుతాను. ★



## ఉతికేశా

**''మా** క్లాస్‌లో ఒక కుర్రాడు అమ్మానాన్నా ఆట ఆడుదాం వస్తావా అని అడిగాడు'' తల్లితో చెప్పింది కూతురు.

''కొంపదీసి ఆడావా ఏమిటి?'' కంగారు పడుతూ అడిగింది తల్లి.

''భేషుగ్గా ఆడాను''

''ఇంతకీ ఎవరే ఆ కుర్రాడు, ఇప్పుడెక్కడున్నాడు?''

''ఆస్పత్రిలో వున్నాడు. నాన్నని నువ్వుతికినట్టే ఉతికేశాగా'' అని చెప్పింది కూతురు.